సాక్షి చిత్తూరు
ఆదివారం । 12 । జనవరి । 2025



పోరాటవీరుడు వడ్డె ఓబన్న

వడ్డె ఓబన్న పోరాటవీరుడని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రబ్బానీ బాషా కొనియాడారు. - 8లో



ఆశించిన రద్దీ ఏదీ?

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ ఏడాది తిరుమలలో ఆశించిన స్థాయిలో రద్దీ నెలకొనలేదు. - 8లో



అధైర్యపడకండి..

అధైర్యపడకండి.. ఏ కష్టమొచ్చినా మేము అండగా ఉంటామని మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు ట్రెక్ చిత్తూరు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిలో ఆదివారం 'ట్రెక్ చిత్తూరు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాలువపల్లె ఫారెస్టు సెక్షన్ అధికారి రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ పలమనేరు రేంజ్ ఆధ్వర్యంలో గౌరీశంకరపురం నుంచి దేవరకొండ వరకు ట్రెక్ చిత్తూరు పేరుతో ట్రెకింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు జిల్లా ఫారెస్టు అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం అందజేస్తున్న దాత

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారికి శనివారం ఓదాత వెండి కిరీటం విరాళంగా బహూకరించారు. తవణంపల్లి మండలం నత్తపచేను గ్రామానికి చెందిన యశ్వంత్ రూ. లక్ష విలువ చేసే కిలో వెండికిరీటం అందజేశారు. అనంతరం ఆలయాధికారులు దాతకు స్వామి వారి దర్శనం కల్పించారు. పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

21న జిల్లాకు ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : భారత అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును అనుసరించి ఏపీలోని షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణ విచారణకు ఈ నెల 21వ తేదీన ఏకసభ్య కమిషన్ సభ్యులు రాజీవ్‌మిశ్రా జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ సభ్యులు రాజీవ్‌మిశ్రా ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు చిత్తూరుకు విచ్చేస్తారన్నారు. అదే రోజు చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థల్లో షెడ్యూల్ కులాల ఉప వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించిన వినతులు స్వీకరిస్తారన్నారు. షెడ్యూల్ కులాల్లోని వివిధ ఉపవర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరమైన వెనుకుబాటును కమిషన్ పరిశీలిస్తుందన్నారు. కమిషన్‌కు నివేదించే వ్యక్తులు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. మెమొరాండం, వినతిపత్రాలపై సంబంధిత అంశాల వాస్తవాలను తగుధ్రువీకరణ పత్రాలతో సమర్పించాలన్నారు. ఈ నెల 21వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నాగయ్యకళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో వినతులు సమర్పించవచ్చన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా చిన్నయ్య



చిన్నయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, ఎంపవర్‌మెంట్ ఆఫీసర్‌గా చిన్నయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న చిన్నయ్యను చిత్తూరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆ శాఖ డీడీగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి వైఎస్సార్ కడప జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ అయ్యారు. ఆమె గత ఏడేళ్లుగా జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ డీఎస్‌డబ్ల్యూఓ, డీడీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు నియమితులైన చిన్నయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, ఎంపవర్‌మెంట్ ఆఫీసర్‌గా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఆయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

కోడి పందేలు.. జూదం ఆడితే కేసులు

చిత్తూరు అర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎక్కడైనా కోడి పందేలు ఆడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో హెచ్చరించారు. పేకాట, ఇతర జూదం నిర్వహించినా వదిలేది లేదన్నారు. సంప్రదాయ క్రీడల పేరిట అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు. ఒక్కసారి కేసులు పెడితే యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడంలో, పాస్‌పోర్టు తీసుకోవడంలో సమస్యలు తలెత్తుతాయనే విషయం గుర్తించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే ఫోన్-112, పోలీసు వాట్సాప్ - 9440900005 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సంక్రాంతి పెద్ద పండుగ.. గాదెలు నిండిన ఆనందంతో తెలుగు లోగిళ్ల గుండెలు నిండుగా నాలుగు రోజులు సంతోషంగా జరుపుకునే అపురూపమైన ప్రకృతి పండుగ. అంతటి పర్వదినం వెలవెల బోతోంది. కర్షకుడికి అందని పెట్టుబడి సాయం.. అతివకు కరువైన ఆసరా.. నిండని అమ్మఒడి.. విద్యార్థికి వసతి, విద్యాదీవెన లేమి.. మొత్తంగా శాపంగా మారిని సంక్షేమం.. వలంటీర్, మద్యం దుకాణ చిరుద్యోగికి ఊడిన ఉద్యోగం.. ఒకటేమి ఏ చేయూత ఇవ్వకపోగా కాల'కూటమి' విషం జిమ్మడమే ఇందుకు కారణం. వెరసి.. సామాన్య, మధ్యతరగతికి ధనలక్ష్మి దూరం.. ఫలితం.. వ్యాపారం వెలవెల బోయిన వైనం.. కనిపించని సం'క్రాంతులు'. ఇదీ జిల్లాలో పరిస్థితి.



చిత్తూరులో వెలవెలబోతున్న నిత్యావసర వస్తువుల దుకాణం

కాసుల్లేవ్.. విపణి విలవిల



- జిల్లాలో కనిపించని పెద్ద పండుగ వ్యాపారం
- వస్త్రాల నుంచి.. పుత్తడి వరకు తగ్గిన వ్యాపారం
- చేతిల్లో పైసల్లేక దిక్కులు చూస్తున్న జిల్లలోని జనం
- గ్రామాల్లో కళ తప్పిన సంక్రాంతి పండుగ

చిత్తూరు అర్బన్: హిందులకు అతి పెద్ద పండుగ సంక్రాంతి. ఏమున్నా, లేకున్నా కుటుంబ సభ్యులతో కలిసి కొత్తదుస్తులు వేసుకోవడం, పిండి వంటలు వండడం, పొలాల్లో పండించిన కొత్త పంట దిగుబడితో ప్రసాదం చేసి దేవుడికి నైవేద్యం పెట్టడం ఆనవాయితీ. ఇంటికి వెల్ల వేసి.. పూర్వీకులకు దుస్తులు పెట్టే ఆచారం పెద్ద పండుగలో ఓ భాగం. కానీ ఈసారి జిల్లాలో ఎక్కడా పెద్దగా సంక్రాంతి వాతావరణం కనిపించడంలేదు. వస్త్రాల నుంచి బంగారం దుకాణాల వరకు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగక చతికిలపడిపోయాయి.

డబ్బులుంటే కదా వ్యాపారం

జిల్లా వాణిజ్య పన్నులశాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి పన్నుల రూపంలో రూ.1,381 కోట్లు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు దాదాపు రూ.980 కోట్ల వరకు మాత్రమే పన్నులు వసూలయ్యాయి. జిల్లాలో జీఎస్టీ లైసెన్స్ ఉన్న వ్యాపారులు దాదాపు 39 వేల మంది ఉంటే, జీఎస్టీ పరిధిలోకి రాని వ్యాపారులు దాదాపు 80 వేల మంది ఉన్నట్లు అంచనా. అసలు జిల్లాలో ఏ రంగం చూసినా ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగడంలేదు. దీనికి ప్రధాన కారణం లేకపోలేదు. ప్రజల వద్ద డబ్బులు ఉంటే, వాటిని మార్కెట్‌లో వస్తువులు కొనడానికి ఖర్చు చేస్తారు. అలా ద్రవ్యం ఒకరి నుంచి మరొకరి వద్దకు రొటేషన్ అవుతుంది. కానీ గత ఆరునెలలుగా ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం నుంచి ప్రజలకు సంక్షేమం రూపంలో రూపాయి అందడంలేదు. దీంతో ప్రజల వద్ద నగదు లేకపోవడం, చాలా వరకు వ్యాపారాలు ఆశించిన స్థాయిలో జరగక, నేల చూపులు చూస్తున్నాయి. ఎటు లేదన్నా కొత్త ఏడాదిలో పెద్ద పండుగ వస్తోందంటే అప్పోసప్పో చేసి పిల్లలకు దుస్తులైనా కొనిచ్చేవాళ్లు. కానీ అప్పు ఇస్తే, మళ్లీ ఎక్కడి నుంచి తీసుకొచ్చి ఇవ్వాలో తెలియక.. అప్పులు కూడా పుట్టడం లేదని దిగువ మధ్యతరగతి ప్రజలు నిట్టూరుస్తున్నారు.

పట్టణాలవైపు చూసేవాళ్లేరీ?

సంక్రాంతి వస్తోందంటే వారం ముందు నుంచే చిత్తూరు లాంటి నగరాల్లో ప్రధాన వీధులు జనంతో కిటకిటలాడాలి. కానీ ఈ సారి పండుగకు ఇక ఒక రోజే ఉన్నా.. పెద్దగా జన సంచారం కనిపించడం లేదు. రెడీమేడ్ వస్త్ర దుకాణాల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. సంక్రాంతి వేళల్లో ఈ ఒక్క రంగంలోనే ఏటా రూ.4 కోట్ల వరకు వ్యాపారం జరిగేదని, కానీ ఈసారి రూ.70 లక్షలకు మించి జిల్లాలో వ్యాపారం లేదని ఓ కార్పొరేట్ వస్త్ర దుకాణ నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇది ఒక్క చిత్తూరుకే పరిమితం కాలేదు. పలమనేరు, పుంగనూరు, నగరి లాంటి చిన్న చిన్న పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక పండుగ వేళల్లో రోజుకు రూ.5 కోట్ల పైగా జరుగుతున్న బులియన్ (బంగారం, వెండి దుకాణాలు) వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ఈ పెద్ద పండుగ వేళ రూ.2 కోట్ల వ్యాపారం కూడా జరగలేదని ట్రేడర్లు చెబుతున్నారు. వంటనూనె దుకాణాల్లో రూ.80 లక్షల వరకు జరిగే పండుగ వ్యాపారం, ఇపుడు రూ.30 లక్షలను దాటడంలేదు. సంక్రాంతి వేళల్లో ఆఫర్లతో వచ్చే ఎలక్ట్రానికల్ వస్తువుల దుకాణాలు నిండిపోయేవి. ఇప్పుడు ఎన్ని ఆఫర్లు ఇస్తున్నా, ఇటు వైపు తిరిగిచూసేవాళ్లు లేరు.

పల్లెలో అంతంత మాత్రమే..

చిత్తూరు జిల్లా పేరు చెబితే చెరుకు, వేరుశనగ, వరి పంటలకు పెట్టింది పేరు. గత ప్రభుత్వ హయంలో రైతులకు ప్రతీ సీజన్‌కు నెల రోజుల ముందే రైతు భరోసా కింద పెట్టబడి సాయం అందేది. ఇప్పుడు ఆ పథకానికి అన్నదాత సుఖీభవ అని పేరు మార్చి, రైతులను ఏమార్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల కాలంలో రెండో సీజన్ ముగుస్తున్నా.. రైతులకు చిల్లిగవ్వ కూడా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. దీంతో పంటల జోలికి వెళ్లి చేతులు కాల్చుకోవడం కన్నా, మిన్నకుండిపోవడం మేలని చాలా చోట్ల సంప్రదాయ పంటల సాగు ఆపివేశారు. పెద్ద పండుగ చేయాలనే ఉద్దేశంతో ఉన్నదాంట్లో కొద్దిగా పిండి వంటలు చేసుకుని, నలుగురిలో నారాయణ అంటూ పండుగ చేసేద్దామని ముందుకు వెళుతున్నారు.



చిత్తూరులో ఖాళీగా దర్శనమిస్తున్న వస్త్ర దుకాణం

వ్యాపారం లేదు..



ఒకప్పుడు సంక్రాంతి వస్తోందంటే రెండు వారాల నుంచి నిత్యావసర వ్యాపారాలు బాగా జరిగేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. వ్యాపారం బాగా పడిపోయింది. జిల్లాలో వెయ్యి వరకు దుకాణాలున్నాయి. గతేడాది సంక్రాంతి పండుగకు దాదాపు రూ.15 కోట్లకు పైగా వ్యాపారం జరిగింది. ఈ ఏడాది పండుగ వ్యాపారం రూ.8 కోట్ల కూడా జరగలేదు. ధరలు పెరుగుదలతో పాటు పట్టణాల్లో షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ కొనుగోళ్లే కారణం. పల్లెల్లో జనం చేతిలో డబ్బుల్లేదంటున్నారు.
– ఉమామహేశ్వర్, జిల్లా అధ్యక్షుడు, ఛాంబర్ ఆఫ్ కామర్స్

30 శాతం వ్యాపారం తగ్గింది



బులియన్ వ్యాపారం గత ఏడాది కంటే 30 శాతం వరకు తగ్గింది. జిల్లాలో దాదాపు 300 పైగా బంగారు దుకాణాలున్నాయి. గత సంవత్సరం పండుగకు రూ.5 కోట్ల వరకు వ్యాపారం జరిగింది. ఈ ఏడాది పండుగకు రూ.2 కోట్లు వ్యాపారం కావడం కష్టంగా ఉంది. బంగారం ధర సంవత్సరంలో 27 శాతం పైగా పెరిగింది. ప్రజల వద్ద డబ్బులు రొటేషన్ కావడం లేదు. ఇవన్నీ వ్యాపారంపై త్రీవ ప్రభావం చూపాయి.
– మురళీ, జిల్లా కార్యదర్శి జ్యూవలర్స్ పాన్ బ్రోకర్స్ సంఘం

గ్రామస్వరాజ్యం జగన్‌తోనే సాధ్యం

- సచివాలయ వ్యవస్థకు చంద్రబాబు తూట్లు
- సూపర్ 6 ఎక్కడ ..?
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటుచేశారని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టంచేశారు. శనివారం ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి పుంగనూరులో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగాలకు దాదాపు 26 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే పారదర్శకంగా అర్హులైన 2.60 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, 1.38 వేల మందిని కార్యదర్శులుగా నియమించినట్టు తెలిపారు. సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకు సేవలు అందించారని చెప్పారు. ప్రస్తుతం తెలుగుదేశం పాలనలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమైందని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10 వేల జీతం ప్రకటించి, వారి చేత ఓట్లు వేయించుకున్న చంద్రబాబు వారికి ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చిన సూపర్ 6 పథకాల్లో ఒక్కటైరా అమలు చేశారా అని ప్రశ్నించారు. 3.66 లక్షల మందికి పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో నష్టపోతున్నది తెలుగుదేశాన్ని గద్దెనెక్కించేందుకు కృషిచేసిన వారే అని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

16న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఆ కాలేజీ ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రముఖ కంపెనీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ మేళాలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు ధ్రువపత్రాలతో అప్రెంటీస్ పాల్గొనేవచ్చన్నారు. అర్హులైన వారు ఐబీఎం పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90306 57957 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నీవే దిక్కు స్వామీ!

- ప్రారంభమైన రెండో విడత టోకెన్ల పంపిణీ
- బిక్కుబిక్కుమంటూనే కౌంటర్లలోకి భక్తులు
- కలవరపెడుతున్న తొక్కిసలాట ఘటన
- మూడు చోట్లే వైకుంఠ ద్వార దర్శ టోకెన్లు పంపిణీ
- మృతుల కుటుంబాలకు పరిహారం టీటీడీ నుంచేనా? ప్రభుత్వం ఇవ్వదా?



విష్ణు నివాసంలో శనివారం రాత్రి టోకన్లు తీసుకుంటున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'నిను చూసి తరించాలని.. నీ సేవతో పులకించాలని తరలి వచ్చాము. మా యోగక్షేమాలు నీపైనే భారమేశాము.' అంటూ పలువురు భక్తులు ఆ కలియుగ నాథుడిని మొక్కుకున్నారు. అనంతరం వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాలకు తరలివెళ్లారు. శనివారం రాత్రి నుంచి రెండో విడత టోకెన్ల జారీ ప్రారంభమైంది.

భయంభయంగానే..

మొదటి విడత వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన భక్తులను కలవరపాటుకు గురిచేస్తోంది. శనివారం నుంచి రెండో విడత టోకెన్ల జారీ చేస్తుండడంతో పలువురు క్యూలైన్లోకి వెళ్దామా? వద్దా? అనే సందిగ్ధంలో పడ్డారు. తిరుపతి నగరంలో శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు నాటి చేదు ఘటన గురించే చర్చించుకుంటున్నారు. తొక్కిసలాట ఘటన విషయంలో ప్రభుత్వం, టీటీడీ తీసుకున్న చర్యలపైనా విమర్శలు గుప్పిస్తున్నారు.

తప్పుని కప్పిపుచ్చడానికి నానాతంటాలు

తొక్కిసలాట వెనుక కారణాలు ఏమిటని సామాన్యులను అడిగితే.. ఒకటే మాట చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం అనే మాటలే వినిపిస్తున్నాయి. జరిగిన పొరబాటును సరిదిద్దుకోవాల్సింది పోయి.. కప్పిపుచ్చేందుకు ఇతరులపై బురదజల్లడం పద్ధతి కాదని హితవు పలుకుతున్నారు. సీఎం చంద్రబాబు వస్తున్నారని రుయా మార్చురీలో ఉన్న మృతదేహాలకు హడావుడిగా పోస్టుమార్టం చేసి తరిమేశారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని స్విమ్స్, శ్రీపద్మావతి వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకుని తిరుపతిలోని ఓ సినీ నిర్మాత ద్వారా వారిని డిశ్చార్జి చేసి పంపేందుకు ప్రయత్నాలు చేశారు. శ్రీపద్మావతి వైద్యకళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందున్న బాధితులను మాజీ సీఎంని కలవకుండా చేసేందుకు కుట్రలు చేశారు.

వారిపై చర్యలు లేవా?

ముఖ్యమైన వారిని వదిలేసి సంబంధం లేని వారిపై చర్యలు తీసుకోవడాన్ని భక్తులు తప్పుబడుతున్నారు. తిరుమల వైకుంఠ ద్వార దర్శనాల నేపథ్యంలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మరణించగా.. పలువురు గాయాలపాలైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో మానవ తప్పిదం, అధికారుల అవగాహనా రాహిత్యం, సమన్వయం లేదనే విషయం స్పష్టమైంది. ఇందులో ముఖ్యంగా ఇంటిలిజెన్స్ వైఫల్యం ఉందని టీటీడీ చైర్మన్ వెల్లడించారు. ఆ తరువాత ఉద్దేశ పూర్వకంగా జరిగింది కాదన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కుట్రకోణం ఉందన్నారు. ఇందులో పోలీసుల తప్పిదం లేదని చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు పొంతన లేని వ్యాఖ్యలు చేస్తున్నారు. టీటీడీ చైర్మన్, ఈఓ, అదనపు ఈఓల మధ్య ఈగోలే కొంప ముంచాయని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఈ విషయాల గురించి సీఎం చంద్రబాబుకు తెలిసినా.. ముగ్గురిని మందలించి వదిలేయడాన్ని భక్తులు, టీటీడీ సిబ్బంది తప్పుబడుతున్నారు. ఇదిలా ఉంటే.. ఈనెల 9న జరిగిన తొక్కిసలాట కేవలం బైరాగపట్టెడ ఎంజీఎం స్కూల్లో మాత్రమే కాదు.. శ్రీనివాసం, విష్ణునివాసం, రామచంద్రపుష్కరిణి, ఇందిరామైదానం వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ఆ తొక్కిసలాటల్లోనూ భక్తులు గాయపడ్డారు. అయితే ఆ కేంద్రాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించిన వారిపై ఎటువంటి చర్యలు లేవు.

ప్రభుత్వం పరిహారం ఇవ్వదా?

మృతిచెందిన వారిలో ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అదే విధంగా టీటీడీ కూడా పరిహారం ఇస్తుందని ప్రకటించింది. బాధిత కుటుంబాలు ప్రభుత్వం రూ.25 లక్షలు, టీటీడీ రూ.25 లక్షలు ఇస్తుందని భావించారు. అయితే శనివారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు టీటీడీ తరుపున బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు శనివారంలోపు పరిహారం చెక్కులు పంపిణీ చేయమన్నారని, అందుకే పంపిణీ చేసినట్టు టీటీడీ చైర్మన్ వివరించారు. ఆయన ప్రకటనతో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి పరిహారం ఇవ్వకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పోరాటవీరుడు వడ్డె ఓబన్న

చిత్తూరు కలెక్టరేట్: వడ్డె ఓబన్న పోరాట వీరుడని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వడ్డె ఓబన్న తొలి స్వాతంత్ర్య సమరయోధుడని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు లెక్క చేయని ధీరుడు అని చెప్పారు. వడ్డె ఓబన్న భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గణనీయమైన పాత్రను పోషించిన ముఖ్యమైన వ్యక్తి అని అన్నారు. కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ మాట్లాడుతూ వడ్డె ఓబన్న దాదాపు 9వేల మంది సైనికులతో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం మొదలు పెట్టారని తెలిపారు. రైతుల హక్కులను రక్షించడానికి, వారి న్యాయం కోసం పోరాడరన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పుంగనూరు: పట్టణంలోని ఆంజనేయస్వామి గుడివీధిలో నివాసం ఉన్న ఒంటరి మహిళ కుమారమ్మ(56) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శనివారం కుమారమ్మ ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కూలీ పనులు చేసుకుంటూ జీవించే కుమారమ్మ ఎప్పుడు, ఎలా చనిపోయిందన్న విషయాలు పోలీసులు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. ఈ మేరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు ఇంటిని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎర్రచందనం స్వాధీనం

చిత్తూరు అర్బన్: నగరంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఇరువారం కూడలి వద్ద టూటౌన్ ఎస్‌ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో చిత్తూరు వైపు వస్తున్న వ్యక్తులు, పోలీసులను చూసి కారు వదిలి పారిపోయారు. పోలీసులు కారును పరిశీలించగా పది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతోపాటు, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగోన్నతిపై చిత్తూరు తహసీల్దార్ బదిలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కళావతి ఉద్యోగోన్నతిపై ఒంగోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు నెలలకు క్రితం ఈమెకు ఉద్యోగోన్నతి వచ్చింది. ఇన్నాళ్లు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. కాగా చిత్తూరు అర్బన్ తహసీల్దార్ నియామకం జరగలేదని, ఈ స్థానానికి గట్టి పోటీ ఉన్నట్లు తెలిసింది.

గోవులు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్: అక్రమంగా గోవులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం ఓ ఆటోలో రెండు ఆవులు, ఆరు దూడలను తీసుకెళుతుండగా.. విశ్వహిందూ పరిషత్‌కు చెందిన రామమూర్తి అనే వ్యక్తి వీటిని పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. కబేళాలకే వీటిని తరలిస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. కాట్పాడికి చెందిన బాషా, హుస్సేన్‌ఖాన్ అనే ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయరామయ్య తెలిపారు.

ఆశించిన రద్దీ ఏదీ?

- వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి గణనీయంగా తగ్గిన రద్దీ
- భక్తుల తొక్కిసలాట నేపథ్యంలో వెలవెలబోతున్న కొండ

తిరుమల: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో పరిమిత సంఖ్యలోనే భక్తులకు టీటీడీ దర్శన భాగ్యం కల్పించింది. గతంలో పోల్చుకుంటే ఈ వైకుంఠ ఏకాదశికి 60,094 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది టికెట్లు జారీ చేసిన సంఖ్య కంటే తక్కువ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో శ్రీవారికి రూ.2.45 కోట్లు సమర్పించారు. ఇక 14,906 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

గత ఏడాది ఇలా..

గత ప్రభుత్వ హయాంలో వైకుంఠ ద్వార దర్శనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించారు. తొక్కిసలాటలకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత ఏడాది 23-12-2023న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారిని 67,906 మంది దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో శ్రీవారికి రూ.2.5 కోట్లు లభించాయి. 28,492 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

పది శాతం తగ్గిన రద్దీ

గత ఏడాదితో పోల్చుకుంటే వైకుంఠ ఏకాదశికి ఈ ఏడాది 10 శాతం మేర భక్తులు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాదిలో 7,906 మంది భక్తులకు అదనంగా శ్రీవారి దర్శన భాగ్యం దక్కింది.

అవి ఒట్టిమాటలేనా?

సామాన్యులకు పెద్ద పీట వేస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆర్భాటం చేశారు. సామాన్యులకు గతంలో ఎన్నడూ జరగని విధంగా దర్శన భాగ్యం చేయిస్తామని ఊదరగొట్టారు. మూడు గంటల్లోపే శ్రీవారి దర్శనం అంటూ ఊరించారు. ఈ మేరకు భారీగా టోకెన్ల జారీ కౌంటర్ల వద్దకు చేరుకునేలా చేశారు. కానీ అక్కడ సరైన ఏర్పాట్లు చేయకపోవడం, భద్రతా లోపంతో భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయేలా చేశారు. ఈ నేపథ్యంలో అధికారుల ఆర్భాటం ప్రకటనల వరకే పరిమితమైందని పలువురు ఆరోపిస్తున్నారు.

వరుసగా సెలవులొచ్చినా..

సెలవు దినాలు వస్తే తిరుమల భక్తజన సందోహంతో నిండిపోయేది. ఆలయ మాడ వీధులు, క్యూలైన్లు అన్నీ భక్తులతో కిక్కిరిసిపోయేవి. శ్రీవారి దర్శనానికి సరాసరి 36 నుంచి 48 గంటల సమయం పట్టేది. వారాంతపు రద్దీ రోజుల్లో 85 వేల మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకునేవారు. అయితే ఈ ఏడాది సంక్రాంతి సెలవులొచ్చినా తిరుమలలో ఆశించిన స్థాయిలో భక్తుల రద్దీ కానరావడం లేదు. సాధారణ రద్దీ కన్నీ తక్కువగానే ఉంది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రద్దీ అనుకున్న మేర కనిపించలేదు. ఆరుగురు భక్తులు మృతిచెందడం, ఏర్పాట్లలో అలసత్వం వెరసి కొండకు రావాలంటేనే భయమేస్తోందని పలువురు భక్తులు వాపోతున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న భక్తులు క్యూకాంప్లెక్స్‌లోకి వెళ్లే క్యూ



తొక్కిసలాట నేపథ్యంలో..

ఇటీవల తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తిరుమలలో క్యూలైన్ పెరిగిందిం. టీటీడీ సౌకర్యాలను పటిష్టంగా చేయని కారణంగా మళ్లీ తోపులాట జరిగే అవకాశం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతో స్వామి వారిని సాధారణ రోజుల్లో కన్నా తక్కువ మంది దర్శించుకుంటున్నారు.

సౌకర్యాలు కల్పించారా?

గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది కనీస సౌకర్యాల కల్పనలో కూడా టీటీడీ నిర్లక్ష్యం వచ్చింది. సామాన్య భక్తులకు సేవ చేయాల్సింది పోయిం.. వీఐపీ సేవలకే పరిమితమైంది. అధికారులు కనీసం సామాన్య భక్తుల వద్దకు వచ్చి సౌకర్యాలపై అడిగి దాఖలాలు లేవు. మూడు గంటల్లో దర్శనం అని చెప్పిన అధికారులుం క్యూలోకి వెళ్లాకం 6 నుంచి 7 గంటల వరకు కంపార్ట్‌మెంట్లలో కూర్చోబెట్టారు. కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదు.

బాబు కన్నా పవన్ కల్యాణ్ బెటర్

– ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమలలో ముక్కోటి ఏకాదశికి వచ్చిన భక్తులకు జరిగిన నష్టం ఊహించలేనిదని, ఇందుకు క్షమాపణలు చెబితే సరిపోదని.. సీఎం చంద్రబాబు క న్నా పవన్‌కల్యాణ్ ఎంతో బెటర్ అని, ఆయన త ప్పులు ఒప్పుకున్నారని రాజంపేట ఎంపీ మిథు న్ రెడ్డి తెలిపారు. శనివారం మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప తో కలసి పుంగనూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవిత్రమైన క్షేత్రంలో జరిగిన తొక్కిసలాటకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఘటన వెనుక కుట్ర లు ఉన్నాయంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేయడం బాధాకరమన్నారు. తిరుమల సంఘటనపై నా మమాత్రంగా చర్యలు తీసుకుని వదలరాదన్నా రు. ఈ ఘటనకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతో మంది ప్రా ణాలు కోల్పోయి, గాయపడితే కేవలం క్షమాప ణలు చెబితే భక్తులకు జరిగిన నష్టం తీరిపోతుందా..? సారీలు చిన్నవాటికే చెప్పాలని, ప్రతి దానికీ సారీలు చెప్పి సమస్యలను దాటవేయ డం మంచిదికాదన్నారు. భవిష్యత్‌లో తిరుమల భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా టీటీడీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాకు నూతనంగా ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు ఎం.అనుపమను కలెక్టరేట్‌లోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా నియమించారు. అలాగే కె. విజయలక్ష్మిని కోనేరు రంగారావు కమిటీకి డిప్యూటీ కలెక్టర్ నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సన్మార్గ గమనమే సంక్రాంతి



పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు, సంఘ సేవకులు

- ఘనంగా సంక్రాంతి కవనోత్సవం
- ప్రముఖులకు 'మహానంది' పురస్కారాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సంక్రాంతి పర్వదినం మానవాళికి సన్మార్గ గమనమని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగాధిపతి ఆచార్య వి.కృష్ణవేణి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య వై.విజయలక్ష్మి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని రెడ్డిభవన్‌లో శనివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య వ్యవస్థాపకులు మత్రిపూడి దేవేంద్రరావు ఆధ్వర్యంలో 'సంక్రాంతి కవనోత్సవం' పేరిట జాతీయ కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ఆచారాలు, సంప్రదాయాలు తెలుగుజాతికి జీవం అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం తెలుగుశాఖ పోస్టు డాక్టోరల్ కేసీ లావణ్య, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పోస్టు డాక్టోరల్ జి. సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి పరిణామాలు, మానవ సంబంధాలపై చైతన్యాన్ని చాటిచెప్పే పెద్దపండుగ సంక్రాంతి అన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మిద్దెల హరి, లయన్స్ క్లబ్ చిత్తూరుగోల్డ్ అధ్యక్షుడు ఎంవీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాజీవన సంక్షేమాన్ని ప్రసాదించమని సూర్యభగవానుడిని త్రికరణశుద్ధిగా స్తుతించమనే శుభదినం సంక్రాంతి అన్నారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి. నారాయణస్వామి, సంఘ సేవకులు పి.పార్థసారథి నాయుడు 'మాట్లాడుతూ సమాజంలో చెలరేగుతున్న దుర్గుణాలన్నింటినీ భోగిమంటల్లో వేయమంటుంది మన సంక్రాంతి అని చెప్పారు. అనంతరం 50 మందికి 'మహానంది' జాతీయ పురస్కారాలు -2025ను ప్రముఖ సాహితీవేత్త దేవేంద్రరావు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు నందిపాటి చక్రపాణి, ఎ.కోమల, కొంతారి వెంకటరత్నం, జి. శాంతకుమారి, గొడుగుచింత గోవిందయ్య, అనంత పద్మనాభన్, సోము ఉమాపతి, రెడ్డిపల్లి షాజహాన్, ఎస్. మునీంద్ర, తోటగోవిందన్, పాలకూరు పద్మప్రపూర్ణ, ఆదివిష్ణు బాలచంద్ర, సంఘసేవకులు బి. కోటీశ్వర మొదలియార్, కె.హరిప్రసాద్ రెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, కె. ఆనందనాయుడు, ఎస్. షణ్ముగం,, వి.పవన్, ఎస్. హరిబాబు, డి. రోహితుకుమార్, ఎం. మొహిద్దీన్ అలీ, ఎం.నేతాజీ, విద్యార్థులు ఎస్. శావంత్, భావన, టి. ఎస్. ప్రవళిక, ఎస్. లిఖిత, భువన్ చంద్, పి. దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పలమనేరు: మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద పలమనేరు–కుప్పం రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం గ్రామానికి చెందిన సైఫుల్లా(40) బైక్‌పై కొలమాసనపల్లెకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం అతడి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సైఫుల్లా అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో సైఫుల్లా మృతదేహం

అధైర్య పడకండి.. అండగా మేమున్నాం

- పార్టీ నేతలను పరామర్శించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి



గాయపడిన జగ్జీవన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

చౌడేపల్లె: ఎవరూ అధైర్యపడకండి.. ఏకష్టమొచ్చినా అండగా మేమున్నామంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం మండలంలోని పుదిపట్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లి, ఆయన్ని పరామర్శించారు. ఇటీవల ఆయన ఆపరేషన్ చేయించుకోవడంతో ఇంటి కెళ్లి మోహన్‌రెడ్డితో మాట్లాడి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకొన్నారు. అలాగే చింతమాకులపల్లె పంచాయతీ బయ్యపల్లెకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పార్టీ నాయకుడు జగ్జీవన్‌రెడ్డిని పరామర్శించారు. లేవలేనిస్థితిలో ఉన్న ఆయన్ని ఓదార్చారు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సంక్రాంతి తరువాత నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్యటిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. దామోదరరాజు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, సర్పంచ్‌ల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సాదిక్‌బాషా, బోయకొండ ఆలయ కమిటీ మాజీ డైరక్టర్ నాగరాజ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రమేష్‌బాబు, నాయకులు పద్మనాభరెడ్డి, లడ్డూ రమణ, మునికృష్ణమనాయుడు, వెంకటరమణ, నాగభూషణరెడ్డి, రవికుమార్‌రెడ్డి, గిరిరెడ్డి, అల్తాఫ్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ

పుంగనూరు: మండలంలోని ఏతూరు గ్రామంలో నిర్వహిస్తున్న మిథున్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలు శనివారం ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో సుమారు 30 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులను ఎమ్మెల్యే, ఎంపీ పరిచయం చేసుకున్నారు. మిథున్‌రెడ్డి క్రికెట్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఏటా నిర్వహించే పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపే ధ్యేయంగా స్నేహపూర్వకంగా పాల్గొనాలని సూచించారు. క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ముందుగా అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిలర్లు అమ్ము, కిజర్‌ఖాన్, జేపీ యాదవ్, నాయకులు ఫకృద్దీన్‌షరీఫ్, రాజేష్, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఏతూరులో బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పలువురికి శుభాకాంక్షలు..

పట్టణంలోని పలువురిని ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ నాయకులు జిమ్‌ఇర్ఫాన్ కుమార్తై, మమ్ము సోదరుడి కుమారుడికి వివాహా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మైనార్టీ నాయకులు సలామత్ అనారోగ్యంతో ఉండటంతో ఆయన్ని పరామర్శించారు.